## అత్యవసర సేవలు అందించడంలో నిమగ్నమైన ఉద్యోగులను అభినందించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 1:** రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నా, వరదల వల్ల చాలా చోట్ల ఇబ్బందికర పరిస్థితులు తలెత్తినా ప్రజానీకానికి అత్యవసర సేవలు అందించడంలో అహర్నిశలు శ్రమిస్తోన్న ప్రభుత్వ ఉద్యోగులు,సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో సిబ్బంది నిమగ్నమైన కొన్ని ఫోటోలను షేర్ చేస్తూ 'భారీ వర్షంలో విరిగిన చెట్టు కొమ్మల మధ్య ప్రాణాలను పణంగా పెట్టి రాష్ట్రానికి వెలుగులు పంచేందుకు రాజీలేని విధి నిర్వహణకు అంకితమైన విద్యుత్ ఉద్యోగులు,సిబ్బందికి పోలీస్,మున్సిపల్ సిబ్బందికి నా అభినందనలు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

## ప్రాణ, ఆస్తినష్టం లేకుండా చర్యలు తీసుకోవాలి

### అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### అధికారులతో పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ టెలీకాన్ఫరెన్సు

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** వర్షాల నేపథ్యంలో జిహెచ్ఎంసి, హెచ్ ఎండిఎ, జలమండలి, హైడ్రా అధికారులు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ అధికారులకు సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో శాఖల ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రేటర్ పరిధిలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను, శిథిల, ప్రమాదకర భవనాల్లో ఉంటున్న ప్రజలను గుర్తించి వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తమ పరిధిలోకి లేక్‌లు, నీటి వనరులపై 24గంటలూ నిఘా ఉంచాలన్నారు. హిమాయత్‌సాగర్, గండిపేట, హుస్సేన్‌సాగర్ నీటి మట్టాలను గమనిస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సీనియర్ అధికారులు, ఉప కమిషనర్లు, ఇతర మున్సిపల్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజా ఫిర్యాదుల, సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలన్నారు. క్షేత్ర సందర్శనలో ప్రజలతో మమేకమై పరిస్థితులను గమనించాలన్నారు. మూసి పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. నాలాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాద వరద కాలువలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు కలుషిత కాకుండా జలమండలి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ సూచనలు ప్రజలందరికి తెలిసేలా చేయాలన్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో బిల్డర్స్‌లకు ఈ సందర్భంగా కీలక ఆదేశాలు జారీ చేశారు. భవన నిర్మాణ కార్మికులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఈ వర్షాల మూలంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. పురాతన, శిథిలావస్థలో ఉన్న భవనాల వద్ద ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు. నాలాలు, అప్రోచ్ నాలాలు ఉన్న ప్రాంతాలలో లౌడ్ స్పీకర్ ద్వారా ప్రచారం చేయాలని మున్సిపల్ అధికారులకు సూచనలు చేశారు. క్రెడాయ్, నారెడ్కో సంస్థలు బిల్డర్స్ అందరూ తప్పని సరిగా కార్మికులు భద్రత కల్పించాలన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో.. సీజనల్ వ్యాధులు, విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

### మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలి

### ఉన్నత స్థాయి సమీక్షలో అధికారులకు మంత్రి దామోదర ఆదేశం



**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** తెలంగాణ వ్యాప్తంగా భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. మెడిసిన్, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాని సూచించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తుండటం, సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండటంతో ఆదివారం తెలంగాణ సచివా లయంలో మంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు, వర్షాలు తగ్గే వరకు ఆసుపత్రుల్లో సిబ్బందికి సెలవులు మంజూరు చేయొద్దని డిఎంఇ డా.వాణి, వివిపి కమిషనర్ అజయ్ కుమార్, డిహెచ్ రవీందర్ నాయక్‌కు ఆదేశించారు. డాక్టర్లు, స్టాఫ్ అంతా హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలనీ, ప్రతీ ఒక్కరూ విధిగా డ్యూటీలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్ (ఈడీడీ) కి దగ్గరగా ఉన్న గర్భిణులను ముందే హాస్పిటళ్లకు తరలించి వెయిటింగ్ రూమ్స్ కేటాయించా లన్నారు. గర్భిణికి ఆమెతో వచ్చిన కుటుంబ సభ్యులకు భోజన వసతి కల్పించాలన్నారు. అంబులెన్స్ సర్వీసులు అన్ని చోట్ల అందుబాటులో ఉండాలనీ, మెడిసిన్, టెస్టింగ్ కిట్లు సైతం అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పేషెంట్లకు అందించే ఆహారం, తాగునీరు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వర్షాలు తగ్గిన తరువాత దోమల బెడద ఎక్కువగా ఉంటుందనీ, తగ్గుముఖం పట్టిన వెంటనే జ్వరాలు విజృంభించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కలిగించాలనీ, ఇందుకోసం పంచాయతీరాజ్, పురపాలక శాఖ సహకారం తీసుకోవాలన్నారు. గురుకులాల్లో పిల్లలకు అందించే భోజనం విషయం లోనూ తగిన జాగ్రత్తలు పాటించేలా సంబంధిత శాఖ అధికారులను సిబ్బందిని అప్రమత్తం చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

## ఇంటర్ ఫుట్‌బాల్ కప్‌కు హైదరాబాద్ సిద్ధం

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఎఐఎఫ్ఎఫ్), తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సంయుక్తంగా నిర్వహించనున్న ఇంటర్ కాంటినెంటల్ ఫుట్‌బాల్ కప్-2024కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ టోర్నమెంట్‌లో భారత్‌తో పాటు, సిరియా, మారిషస్ దేశాలు పాల్గొంటున్నాయి. ఈ నెల 3వ తేదీన ఇండియా, మారిషస్ మధ్య, 6వ తేదీన మారిషస్, సిరియా మధ్య, 9వ తేదీనన ఇండియా. సిరియా మధ్య ఈ టోర్నమెంట్ జరుగనుంది. ఇందు కోసం స్పోర్ట్స్ అథారిటీ గచ్చిబౌలి స్టేడియంలో అవసరమైన ఆధునీకరణ పనులు చేపట్టింది. ఆటగాళ్లు, అతిథుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ టోర్నీని సజావుగా నిర్వహించేందుకు అంతర్గత కమిటీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయి.

# భద్రాచలం ఏజెన్సీ అతలాకుతలం

### జోరు వానతో తడిసి ముద్దయిన భద్రగిరి

### పెరిగి తగ్గుతున్న గోదావరి.. పొంగుతున్న వాగులు, వంకలు

### పలుచోట్ల నిలిచిన వాహనాల రాకపోకలు

### బూర్గంపాడు మండలంలో కొట్టుకుపోయిన పశువులు

### తాలిపేరు ప్రాజెక్టులో 25 గేట్లు ఎత్తివేత

### పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్



పర్యటిస్తున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



పాలవాగు పొంగడంతో వరదల్లో కొట్టుకుపోయి చనిపోయిన పశువులు

**భద్రాచలం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** జోరువాన భద్రాచలం ఏజెన్సీని అతలా కుతలం చేసింది. కుండపోతగా కురిసిన వర్షాలకు భద్రగిరి తడిసి ముద్దయింది. పలుచోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లు తున్నాయి. రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. భద్రాచలం వద్ద గోదావరి పెరిగి క్రమేపి తగ్గుముకం పడుతోంది. గోదావరి మళ్లీ పెరిగే అవకాశం ఉందని సమాచారం. చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరుకోవడంతో ఆదివారం ప్రాజెక్టులో ఉన్న మొత్తం 25 గేట్లు ఎత్తి దిగువ భాగానికి నీటిని విడిచిపెట్టారు. తుఫాన్ ఎఫెక్ట్ మరికొద్ది రోజులు ఉండటంతో సర్వత్రా ఆందోళన అలముకుంది. విషజ్వరాలతో అల్లాడుతున్న స్థానికులకు చల్లగాలులతో కురుస్తున్న వానలు మరింత ఉక్కిరిబిక్కిరి లోను చేస్తున్నాయి. ఇందుకు సంబంధించి ప్రభాతవార్త అందిస్తున్న వివరాలు...

**వానలతో ఏజెన్సీ అతలా కుతలం..**

తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వానలు భద్రాచలం ఏజెన్సీని ఉక్కిరిబిక్కిరికి లోనుచేస్తున్నాయి. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేని వానలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి భద్రాచలం పట్టణ కాలనీలు దాదాపు జలమయం అయ్యాయి. కొన్ని చోట్ల ఇల్లల్లోకి వర్షపునీరు చేరుకుంది. కుండపోతలా వాన కురుస్తుండటంతో పట్టణ వాసులు తీవ్ర ఆందోళన చెందారు. పట్టణంలోని లోతట్టు కాలనీలు జలమయం కావడంతో మోకాళ్లలోతు నీరు కాలనీ వాసులు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు రాత్రంతా జాగారం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఎక్కడికక్కడ చెట్లు నేలకొరిగాయి. ఇదిలా ఉండగా భద్రాచలం వద్ద గోదావరి క్రమేపి పెరుగుతూ వచ్చి ఆదివారం సాయంత్రం నుంచి తగ్గుముఖం పట్టింది. శనివారం 23 అడుగులు ఉన్న గోదావరి ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు 31.9 అడుగులకు చేరుకుంది. క్రమేపి గోదావరి పెరుగుతుందని భావించినరప్పటికీ సాయంత్రం 6 గంటల నుంచి తగ్గుముఖం పట్టి 30.8 అడుగులకు చేరుకుంది. సోమవారం మధ్యాహ్నం నుంచి మళ్లీ గోదావరి పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ హుటాహుటిన భద్రాచలం చేరుకొని కరకట్ట విస్తా కాంప్లెక్స్ ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానిక అధికారులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ గ్రామ పంచాయతీ ఊర్లదోసలపాడు వద్ద పాలవాగు పొంగడంతో కట్టేసి ఉన్న 30 పశువులు గల్లంత య్యాయి. ఇదిలా ఉండగా నకిరిపేట వేపలగడ్డ మధ్య కల్వర్టు కొట్టుకుపోయింది. సీతారామా ప్రాజెక్టు కాలువ లోకి భారీగా వరదనీరు చేరుకుంది. దీంతో రాకపోకలు ఇబ్బందులు ఏర్పడ్డాయి. బుర్ర వేముల - గంగోలు మధ్య ప్రధాన రహదారిపైకి కూడా వరదనీరు చేరుకుంది. దీంతో భద్రాచలం - చర్ల - దుమ్ముగూడెం మధ్య రాకపోకలు ఆదివారం ఉదయం వేళ నిలిచిపోయాయి. గుబ్బలమంగి, సీత వాగు, గంగోలు చెరువు పొంగి పొర్లుతున్నాయి. పర్ణశాల నారచీరెల ప్రాంతం నీట మునిగింది. దీంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇందిలా ఉండగా చర్ల మండలంలో జోరు వానలు కురుస్తున్నాయి. ఎగువ భాగమైన ఛత్తీస్‌గఢ్‌లో కూడా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దిగువ భాగానికి వరదనీరు చేరుకుంటుంది. తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వర్షం నీరు చేరుకోవడంతో ప్రాజెక్టు అధికారులు ఆదివారం మొత్తం ప్రాజెక్టులో ఉన్న 25 గేట్లు పైకెత్తి 42,316 క్యూసెక్కుల వరద నీటిని దిగువ భాగానికి విడిపెట్టారు. మరికొన్ని రోజులు కూడా తుఫాన్ ఎఫెక్ట్ ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ఏజెన్సీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# పాలేరులో వరదలు.. కొట్టుకుపోయిన కుటుంబం

### వాతావరణం అనుకూలించక రక్షించలేకపోయా..

### రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భావోద్వేగం



**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని కూసుమంచి మండలం నాయక్‌గూడెంకు చెందిన యాకూబ్, ఆయన భార్య సైదా వరదల్లో కొట్టుకొని పోవడం వల్ల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఉదయం నుంచి ఆ కుటుంబాన్ని రక్షించేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో ఇద్దరి ప్రాణాలు కాపాడలేకపోయినందుకు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్ తెలంగాణ సచివాలయంలోని తన కార్యాలయంలో భారీ వర్షాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విలేకరుల సమావేశంలో మాట్లాడుతుండగానే యాకూబ్ కుటుంబం వరదలో కొట్టుకొని పోయిన సమాచారం అందడంతో ఒక్కసారిగా ఖిన్నుడయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగేలేటి మాట్లాడుతూ తాను ఉదయం నుంచి ఆ కుటుంబాన్ని కాపాడటానికి చాలా ప్రయత్నించారనీ, భారీ వర్షాలకు హెలికాప్టర్లు టేక్ ఆఫ్ కావడం కష్టమన్న సమాధానం వచ్చిందనీ, మరోవైపు, యాకూబ్‌తో పాటు ఆయ భార్య సైదాతో నిరంతరం మాట్లాడుతూ ధైర్యం చెబుతూనే ఉన్నామని చెప్పారు. ఎన్‌డిఆర్ఎస్ బృందాలను సైతం అక్కడికి పంపామనీ, వరదకు ఆ బృందాలు అక్కడికి వెళ్లలేక పోయాయని వెల్లడించారు. రాష్ట్రంలో ఎవరూ కూడా వరదలు పోటెత్తే ప్రాంతాల్లో ఉండొద్దనీ వీలైనంత వరకు ఎత్తైన ప్రదేశాలకు వెళ్లాలని సూచించారు. అధికార యంత్రంగం కూడా వెంటనే తగిన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు.

**భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : పొంగులేటి**

రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా తగిన చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఈమేరకు ఆదివారం తెలంగాణ సచివాలయం నుంచి మంత్రి పొంగులేటి జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పిలతో సీఎం శాంతికుమారి, డీజీపీ డా.జితేందర్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని జిల్లా కలెక్టర్లకు తగు సూచనలు అందజేశారు. మున్సిపల్, వైద్య, ఆరోగ్య, నీటి పారుదల, రెవెన్యూ డిజాస్టర్ మేనేజ్మెంట్, జీహెచ్ఎంసి, జలమండలి, ట్రాన్స్‌కో, తదితర శాఖల ఉన్నతాధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## నీట మునిగిన సబ్ స్టేషన్ల పునరుద్ధరణ చర్యలు

### విద్యుత్‌కు అంతరాయం లేకుండా ఏర్పాట్లు: డిప్యూటీ సిఎం భట్టి

### రోడ్ల దుస్థితిపై దృష్టి పెట్టండి : మంత్రి కోమటిరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 1:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల కురుస్తున్న భారీ వర్షాలతో ఏర్పడిన విద్యుత్ సమస్యలపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క... విద్యుత్ అధికారులతో మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆదివారంనాడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం కలిగిన చోట పునరుద్ధరణకు కలెక్టర్,పోలీస్ రెవెన్యూ,జిల్లా శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చేయాలని సూచించారు. వరదల వల్ల నీట మునిగిన సబ్ స్టేషన్లపిడుగులు పడి దెబ్బతిన్న చోట మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయంగా పక్క సబ్‌స్టేషనన నుంచి విద్యుత్‌ను సరఫరా చేయాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. 24 గంటలూ అలర్ట్‌గా ఉండి కంట్రోల్ రూమ్ నుంచి వచ్చే ఆదేశాలను క్షేత్ర స్థాయిలో ఉన్న అధికారులు ఎప్పటికప్పుడు అమలు చేయాలని పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి సంబంధించిన సమస్యలు ఉంటే ప్రజలు వాటి పరిష్కారం కోసం విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

**రోడ్ల దుస్థితిపై దృష్టి పెట్టండి**

వాతావరణ శాఖ రాష్ట్రంలోని 11 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో ఆయా జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆయా జిల్లా కలెక్టర్లు,ఆర్ అండ్ బి శాఖ క్షేత్ర స్థాయి అధికారు లతో సమీక్ష నిర్వహించారు. ప్రాణ,ఆస్తి నష్టం జరగ కుండా ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొ నేందుకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం వర్షాలపై ఎప్పటి కప్పుడు సమీక్షిస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు.

**ఇరిగేషన్‌లో సెలవులు రద్దు**

రాష్ట్రంలో రెడ్‌ఎలెర్ట్ ప్రకటించినందున నీటిపారుదల శాఖ సిబ్బందికి సెలవులు రద్దు చేసి నట్లుగా ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడిం చారు. నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన వఇడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

## మహబూబాబాద్ పోలీసులకు డిజిపి అభినందన

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** తెలంగాణలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మహబూబాబాద్ వద్ద రైలు పట్టాల మీదుగా వరదనీరు ప్రవహించడంతో ఆ ప్రాంతంలో రైళ్లను నిలిపివేశారు. దీంతో ఈ ప్రాంతంలో ఆగిపోయిన రైలు ప్రయాణీకులకు ఆహారంతో పాటు వాటర్ బాటిళ్లు అందించిన మహ బూబాబాద్ పోలీసులను డిజిపి జితేందర్ ఆదివారం నాడు అభినందించారు. భారీ వర్షం వల్ల జిల్లాలోని కేసముద్రం వద్ద రైలు పట్టాల కింద కంకర కొట్టుకు పోవడం తో ఈ విషయాన్ని గమనించిన రైల్వే సిబ్బంది శనివారం అర్థరాత్రి తరువాత రైళ్ల రాకపోకలను ముందుగానే నిలిపివేశారు. దీంతో కేసముద్రంలో ఆగిపోయిన రైలుని ప్రయాణీకులు మొదట గంటల తరబడి ఇబ్బందులకు గురయ్యారు. కేసముద్రం రైల్వే స్టేషన్ చిన్నది కావడంతో ప్రయాణీకులకు ఎలాంటి ఆహారం లభించలేదు. దీంతో ఈ విషయం ఆదివారం ఉదయం తెలుసు కున్న స్థానిక పోలీసులు వెంటనే స్పందించి ఆహార పొట్లాలతో పాటు బిస్కట్ పాకెట్లు, వాటర్ బాటిళ్లను ప్రయాణీకులకు ఉచితంగా అందించారు. దీంతో రైలులోని ప్రయాణీకులు ఊరట చెందారు. కాగా ఈ విషయమై స్పందించిన డిజిపి జితేందర్ మహబూబాబాద్ పోలీసులను అభినందించారు.

# నిండా మునిగిన వరంగల్లు

### పొంగిపొర్లుతున్న వాగులు

### వందల ఎకరాల్లో పంట నష్టం

### నిండుకుండలను తలపిస్తున్న గ్రామాలు



**హన్మకొండజిల్లా బ్యూరో- ప్రభాతవార్త:** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కొండు పోతగా వర్షంతో ఒరుగల్లు ఉమ్మడి జిల్లా నీటమునిగింది. ఓరుగల్లు నగరంలోని వందల కానీలు జలమయమైనాయి. ఓరుగల్లు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలలో 43 సెంటిమీటర్ల వర్షాపాతం నమోదు కాగా ఆదివారం ఉదయం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఓరుగల్లులోని హన్మకొండ, వరంగల్, కాజీపేటతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలు పలు గ్రామాలు నీటమునిగాయి. ఓరుగల్లు నగరంలోని హన్మకొండ, వరంగల్, కాజిపేట ట్రైసిటీలోని వందలకు పైగా కాలనీలు జల ద్రిగ్బందంలో చిక్కుకున్నాయి. లోతట్టు కాలనీలైన పలు కాలనీల్లోని ఇండ్లకు వరద నీరు రావడంతో నగరంలోని కాలనీ వాసులు తమ ఇండ్లలోని నీళ్లు ఎత్తిపోస్తూ బిక్కు బిక్కుమంఉటున్నారు. లోతట్టు ప్రాంతాల వారు తమ ఇండ్లపైకి ఎక్కి వర్షానికి వనుకుతున్నారు. నగరంలోని అంబేద్కర్ సెంటర్ వడ్డెపల్లి, గాంధీనగర్, భవాణినగర్, అశోకకాలనీ, వాజ్‌పయ్‌కాలనీ, నయింనగర్, పోచమ్మకుంట వికాస్‌నగర్, జులైవాడ, ప్రకాష్‌రెడ్డిపేట, గాయత్రికాలనీ, వాసవికాలనీ, కృష్ణకాలనీ, దేశాయిపేట, సంతోషిమాతకాలనీ, శివనగర్, కరీమాబాద్, కాపువాడ, సుధనగర్, కేయూ రోడ్డు సమీపాన గల కాజిపేట జంక్షన్ బస్టాండ్‌తో సహా అన్ని కాలనీలు, జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. నగరంలోని ప్రధాన రోడ్లపై వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలగింది. వరంగల్ - జనగామా- హైదరాబాద్ ప్రధాన రహదారుల్లో నీరు వరదలా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. మధ్యాహ్నం 3గంటల నుండి వర్షం తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. నాలాలు ఉప్పొంగడం, వర్షపు నీటితో పాటు డ్రైనేజీలు, ఉప్పొంగి నదులను తలపిస్తుండటంతో ఓరుగల్లు నగరమంతా నరకంలా తలపిస్తుంది. ఆదివారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కురిసిన వర్షాలకు నదులను తలపిస్తుండగా నర్సంపేట, పరకాల, మహబూబాబాద్, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, భూపాలపల్లి, ములుగు, ఏటూరునాగారం, పాలకుర్తి, తొర్రూరు పలు ప్రాంతాలలో అత్యధిక వర్షాపాతం నమోదుకాగా ఆయా డివిజన్‌లలోని గ్రామాలలోని చెరువులు, కుంటలు మత్తళ్లు పోస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ముగ్గురు వరదలో చిక్కుకొని గల్లంతై మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ఆత్మకూరు మండలం కటాక్షపురం చెరువు మత్తడి పోస్తుండటంతో ములుగు ప్రధాన రహదారి రాకపోకలు బంద్ అయ్యాయి. వేల ఎకరాల్లో మొక్కజొన్న పత్తి, మిర్చి వరి సాగు నీట మునిగాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు విరిగిపడటంతో శనివారం రాత్రి ఆదివారం రోజంతా విద్యుత్ లేక అనేక గ్రామాలు అందకారంలోనే ఉన్నాయి. స్థంబాలు విరిగిపడటంతో విద్యుత్ అధికారులు విద్యుత్ మరమ్మత్తులు చేపట్టారు. జిల్లా ఉన్నతాధికారులు, హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి నగరంలోని వరద ముంపు ప్రాంతాలను అధికారులను అప్రమత్తం చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు గ్రామాలను, నిండుకుండలో తెగిపోయే దశలో ఉన్న చెరువులను పరిశీలించి సమీక్షిస్తున్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగంతో పాటు రిస్కిటీమ్‌లను, ఎన్‌జిఆర్ బృందాలను అధికారులు సిద్ధంగా ఉంచారు. ఎన్నడు లేని విధంగా కుండపోత వర్షం కురియడంతో ఓరుగల్లు నగరమంతా ఎటు చూసినా నీటితో నదులను తలపిస్తున్నట్లు నగర వాసులు విచారం వ్యక్తం చేస్తున్నారు. నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని పదే పదే అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నప్పటికి ఆచరణలో మాత్రం కానరావడం లేదని గతంలో మాదిరిగానే ఈ ఏడు ఓరుగల్లు నీటమునిగిందని, కబ్జాకు గురైన నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని నగరంలో అండర్ డ్రైనేజి సిస్టమ్ ఏర్పాటు చేయాలని వరద ముంపు ప్రాంతాలను గుర్తించి కాలనీలలో నీరు రాకుండా శాశ్వత నిర్మాణ పనులు చేపట్టాలని ఓరుగల్లు నగర వాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

